ప్రజాశక్తి
శనివారం 10 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం

బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బాల్య వివాహాలు జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. ఆలయాలు, కళ్యాణ మండపాలు, గ్రామాల్లో జరిగే ప్రతి వివాహంలో వధువుకు 18 ఏళ్లు, వరునికి 21 ఏళ్లు నిండినట్లు గ్రామస్థాయి అధికారులు, కళ్యాణ మండపాల యాజమాన్యాలు పరిశీలించాలని సూచించారు. నకిలీ ఆధార్‌కార్డులు, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలపై సమగ్ర పరిశీలన చేసి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రభుత్వం, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అడుగులు వేస్తున్నాయని తెలిపారు.

వ్యవసాయంలోకి కార్పొరేట్ల చొరబాటు

- కార్పొరేట్ల బహిష్కరణతోనే వ్యవసాయ పరిరక్షణ
- క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమం
- సంయుక్త కిసాన్ మోర్చా నిరసనలు

నిరసన తెలుపుతున్న కిసాన్ సంయుక్త మోర్చా నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయంలోకి కార్పొరేట్ల చొరబాటు పెరిగిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. ఫలితంగా వారు భారీ లాభాలు ఆర్జిస్తుండగా, రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల బహిష్కరణతోనే వ్యవసాయ పరిరక్షణ సాధ్యమన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో మేరకు సేవ్ ఇండియా - సేవ్ అగ్రికల్చర్ నినాదంతో క్విట్ కార్పొరేట్ పేరిట శుక్రవారం జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాకుళం నగరంలోని పాతబస్టాండ్ వద్ద గల రిలయన్స్ స్మార్ట్ మార్టు ఎదుట నిరసన చేపట్టిన అనంతరం ఎన్‌జిఒ హోం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్విట్ ఇండియా దినోత్సవ స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుంటామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ గ్యారంటీలతో పాటు రూ.లక్షల కోట్ల రాయితీలు, రుణాలను మంజూరు చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులకు అనుకూలమైన రుణ విమోచన చట్టం, విత్తన చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలంటే కనీసం పట్టించుకోవడం లేద న్నారు. వ్యవసాయ ఉత్పత్తులని పది రెట్లు ఎక్కువగా అమ్ముతున్న బడా కార్పొరేట్ కంపెనీలకు అనేక రాయితీలు, రుణాలను ప్రజాధనాన్ని ఉదార స్వభావంతో అందిస్తున్నారని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం నోట్లో మట్టి కొడుతున్నారని దుయ్యబట్టారు. బ్యాంకుల రుణాలు ఎగ్గొట్టిన బడా కంపెనీలకే మళ్లీ రుణాలు మాఫీ చేసి, రుణాలు మంజూరు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి పాలన బడా కార్పొరేట్ కంపెనీల అనుకూల పాలనగా, అనుకూల చట్టాలు చేసే ప్రభుత్వంగా తయారైందని విమర్శించారు. అన్ని వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించాలనే డిమాండ్‌ను నేటికీ నెరవేర్చలేదన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే కంపెనీలు, అన్ని పంటల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే బడా కంపెనీలను దేశంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా పిలుపుతో స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగిందని, ఆ స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దుర్మార్గ విధానాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, ఎం.ఆదినారాయణ మూర్తి, నగర కన్వీనర్ టి.ప్రకాష్, రైతు కూలీ సంఘం నాయకులు తాండ్ర అరుణ, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, ఐఎఫ్‌టియు నాయకులు ఎన్.నీలంరాజు, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : మండల కేంద్రంలో రామతీర్థం కూడలి వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి.భాస్కరరావు, బి.రామకృష్ణ, ఎన్.మోహనరావు, ఎస్.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : జి.సిగడాం, బాతువలో రైతుసంఘం ఆధ్వర్యాన చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, కె.సీతంనాయుడు, ఎస్.మన్మథరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ పాతబస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎన్.గణపతి, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు, మద్దిలి రామారావు, టి.అజయ్ కుమార్, ఎన్.ఢిల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నాయకులు కోత మధు, రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, రైతుసంఘం నాయకులు సాంబమూర్తి, బొడ్డేపల్లి మల్లయ్య, కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన ఆఫ్‌షోర్

- ఆరు నెలలుగా నిలిచిన పనులు
- రూ.20 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్
- పనులను ఆపేసిన కాంట్రాక్టర్
- స్పందించని ప్రభుత్వం

అసంపూర్తిగా ఉన్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు

టెక్కలి, పలాస నియోజకవర్గాలకు సాగు, తాగునీరందించే ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ప్రస్తుతం పడకేసింది. రిజర్వాయర్ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. ప్రాజెక్టు పనులు చేపడుతున్న సంబంధిత నిర్మాణ సంస్థకు ప్రభుత్వం కోట్లాది రూపాయిలు బకాయి పడినట్లు తెలుస్తోంది. ఇదిగో, అదిగో చెల్లింపులు చేస్తామంటూ ప్రభుత్వం చెప్పినా ఒక్క పైసా విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ఉన్నపళంగా ఆపేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 45 శాతమే పనులు పూర్తయ్యాయి. మరోవైపు నిర్వాసితుల పునరావాసం, పరిహారం సమస్యలూ పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు మాత్రం వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేస్తామంటూ చెప్తుండడంపై అందరిలోనూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి, మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఇ.సి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణ పనులు సకాలంలో కాకపోవడం, ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించకపోవడంతో 2014 వరకు పనులు ప్రారంభం కాలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జూలై 7, 2019 వరకు గడువిచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

ఐదేళ్లలో ఏడు శాతమే పనులు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.855 కోట్ల అంచనా వ్యయంతో 2021 సెప్టెంబర్‌లో అధికారులు ప్రతిపాదనలు పంపగా 2022 సెప్టెంబర్‌లో సవరించిన అంచనాల మేరకు రూ.852.45 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇప్పటివరకు 45 శాతం పనులు మాత్రమే జరిగాయి. అంటే నాలుగున్నరేళ్లలో ఏడు శాతమే పనులు జరిగాయి.

పనులు 45 శాతమే

రిజర్వాయర్ పనులు ప్రస్తుతం 45 శాతం మేర జరిగాయి. మట్టి పనులు 83,31,000 క్యూబిక్ మీటర్ల పని చేపట్టాల్సి ఉండగా, 42,36,527 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. ఇంకా 40,94,473 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాంక్రీట్ పనులు 1,31,544 క్యూబిక్ మీటర్ల పని జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 2,457 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. మరో 1,29,087 క్యూబిక్ మీటర్ల పని పెండింగ్‌లో ఉంది.

పనులు 45 శాతం... ఖర్చు 70 శాతం

రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఖర్చుల విషయంలో మాత్రం గత టిడిపి ప్రభుత్వం ఎక్కడా తగ్గలేదు. రిజర్వాయర్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. అందులో రూ.325.45 కోట్లను వెచ్చించింది. అంటే 70 శాతం మేర ఖర్చు చేసింది.

అపరిష్కృతంగా నిర్వాసితుల సమస్యలు

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు ప్రారంభమై 17 ఏళ్లు కావస్తున్నా, నిర్వాసితుల సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణంతో 1059 కుటుంబాలు నిర్వాసితులు కాగా, అందులో ఇప్పటివరకు 659 కుటుంబాలకే పునరావాసం కల్పించారు. కొన్నిచోట్ల పరిహారం చెల్లింపులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని క్లియర్ చేస్తే గానీ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు.

రూ.20 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి కాకపోవడానికి ప్రభుత్వ ఉదాసీనమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పనులు చేస్తున్న ఎస్.వి.ఇ.సి-ఇందు సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోవడానికి దారితీసింది. సంబంధిత నిర్మాణ సంస్థకు ప్రభుత్వం రూ.20.34 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిలపై ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో, సంబంధిత కాంట్రాక్టర్ ఉన్నపళంగా పనులను ఆపేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

ప్రజాప్రతినిధులు స్పందించేనా?

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పూర్తయితే టెక్కలి, పలాస నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు మేలు కలగనుంది. నిర్మాణ పనులను పట్టాలెక్కించాలంటే ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జోక్యం చేసుకుంటేనే సాధ్యపడుతుంది. వంశధార కాలువల్లో పూడిక తొలగింపునకు కొంత చొరవ చూపినా జిల్లాలో ముఖ్యమైన ప్రాజెక్టు అయిన ఆఫ్‌షోర్‌పై ఇప్పటివరకు స్పందించలేదు. ప్రాజెక్టు నిర్మాణ పనులపై సమీక్ష చేపట్టడం గానీ, ఆ ప్రాంతాన్ని సందర్శించి పనులు పరిశీలించడం గానీ చేయలేదు. ఇప్పటికైనా ఇరువురు ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే ఆఫ్‌షోర్ త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

- ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి
- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - జి.సిగడాం

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో శుక్రవారం పర్యటించి తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఫ్రై డే డ్రై డేపై ఆరా తీశారు. కలెక్టర్ వస్తే గానీ గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేయరా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోతే ఇంటికి వెళ్లిపోవాలన్నారు. బావులు, బోర్లు దగ్గర క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లి గ్రామ పారిశుధ్యం మెరుగుపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. గ్రామంలో డయేరియా బారిన పడిన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోగులు మెరుగుపడే వరకు వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎంపిడిఒ కె.వెంకన్నబాబు, జి.సిగడాం వైద్యాధికారి యశ్వంత్, సుమ బిందు, సర్పంచ్ కామోజులు సీతారాం, ఎంపిటిసి సభ్యుడు జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి ధర్మవరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ సెలవు రోజుల్లో, రెండో శనివారం, ఆదివారం రోజుల్లో పాఠశాలలు తెరవరాదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఏ పాఠశాలలైనా తరగతులు నిర్వహిస్తే వాటిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

బుద్ధదేవ్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, కొత్తూరు

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నాయకులు బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమంతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా, 2000-11 మధ్య పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన పనిచేశారని చెప్పారు. 1966లో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై, అదే ఏడాది సిపిఎంలో చేరి అంచెలంచెలుగా పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారని తెలిపారు. రచయిత అయిన ఆయన బెంగాలీ సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేశారని కొనియాడారు. మూడు దశాబ్దాల పాటు బెంగాల్ వామపక్ష ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆయన మరణంతో ఒక అధ్యాయం ముగిసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.మోహనరావు, వి.జి.కె మూర్తి, ఎం.ఆదినారాయణమూర్తి, ఎ.సోమశేఖర్, ఆర్.ప్రకాష్, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, రమేష్, లక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

మాతా శిశు మరణాల నివారణే ధ్యేయం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా కిల్కారి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాయిస్ కాల్స్ సేవలతో మాతా శిశు ఆరోగ్యానికి భద్రత, గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించనున్నట్లు చెప్పారు. మహిళలు గర్భవతిగా ఉన్నప్పుడు స్థానిక ఎఎన్‌ఎం వద్ద గర్భస్థ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. మొబైల్ నంబరుకు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని, గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్‌ను రూపొందించినట్లు వివరించారు. గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైల్‌కు డాక్టర్ అనిత వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ కాల్ సమయం సుమారు 1.40 నిమిషాలు ఉంటుందని తెలిపారు. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 01244451660 నంబరు నుంచి వాయిస్ కాల్ వస్తుందన్నారు. ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవిఆర్ వ్యవస్థ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒకరోజు మూడుసార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆ సందేశాన్ని వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేసి వినవచ్చని చెప్పారు. ఆశా కార్యకర్తల విజ్ఞానాన్ని బలోపేతం చేయడానికి మొబైల్ అకాడమీ కోర్సును 11 మోడ్యూల్స్ ద్వారా అందించేందుకు రూపకల్పన చేశారని తెలిపారు. 14424 టోల్ ఫ్రీకి డయల్ చేస్తే కోర్సులో చేరేందుకు దోహదపడుతుందన్నారు. తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించే ఈ బృహత్తర కార్యక్రమం గురించి గర్భిణులకు అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

కృషి వికాస్ యోజన కింద జిల్లాకు రూ.14.32 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యాన పంటలకు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా అధిక మొత్తంలో నిధులు విడుదల చేసిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్‌తో కలిసి శుక్రవారం మాట్లాడారు. 2021-23 సంవత్సరాల మధ్య జిల్లాలో ఉద్యానశాఖకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు చెల్లించాల్సిన ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్‌ఫామ్ పథకంలో జిల్లాలో కొత్తగా ఆయిల్‌ఫామ్ నాటిన రైతులకు సబ్సిడీతో కూడిన మొక్కలు పూర్తి రాయితీతో 1430 హెక్టార్లలో అందించామన్నారు. 814 హెక్టార్లలో ఆయిల్‌ఫామ్ సాగు చేసేందుకు ఎరువు నిమిత్తం వారి బ్యాంకు అకౌంట్లకు జమ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు రూ.28.33 లక్షలు జమ అయిందని తెలిపారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద మామిడి, జీడిమామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, ప్లాస్టిక్ మల్చింగ్, కోకో, సంకరజాతి కూరగాయల పెంపకం సాగు చేసే రైతులకు రూ.86.87 లక్షల సబ్సిడీ మొత్తం అందజేసేందుకు నిధులు విడుదల చేశామని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు రూ.73.03 లక్షలు రైతుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద జిల్లాలో నెలకొల్పిన పలు ఉద్యాన పంటల సేకరణ కేంద్రం నిర్మాణానికి ఒక్కో సెంటరుకు రూ.11.25 లక్షలు చొప్పున జిల్లావ్యాప్తంగా 29 కలెక్షన్ సెంటర్లకు రూ.200.25 లక్షలు ఇదివరకే రైతు సంఘాల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు మరో విడతలో రైతు సంఘాలకు రూ.95 లక్షలు ఇచ్చామని, శీతల గదుల నిర్మాణాల కోసం ఒక్కో నిర్మాణానికి రూ.9.37 లక్షలు చొప్పున తొమ్మిది నిర్మాణాలకు ఇదివరకే రూ.59.37 లక్షలు సంఘాలకు ఇచ్చి, తాజాగా మరో విడతలో రూ.25 లక్షలు విడుదల చేశామన్నారు. మిలిగిన రైతులకు మరో విడతలో రాయితీ సొమ్ము అందిస్తామని తెలిపారు. మొత్తంగా జిల్లాకు ఉద్యానవన శాఖ ద్వారా ఇప్పటివరకు రైతు సంఘాలకు, రైతులకు కలిపి అన్ని పథకాలకు రూ.5.18 కోట్ల నిధులు విడుదల చేసి పెద్దఎత్తున ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు.

సాంకేతికతతో చోరీ సెల్‌ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు సాంకేతిక విధానంలో బ్లాంకింగ్ రిక్వెస్టులో నమోదు చేసుకుంటే వారి ఫోన్‌ను రికవరీ చేసే అవకాశముంటుందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. చోరీకి గురైన రూ.15 లక్షల విలువైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి జిల్లా పోలీసుల కార్యాలయంలో వంద మంది బాధితులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్లను పోగొట్టుకున్న వారు సెంట్రల్ ఎంక్యూప్‌మెంటు ఐడెంటిటీ రిజిస్టరు పోర్టల్ ద్వారా https://www.ceir.gov.in వెబ్‌సైట్‌లో ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది జూన్ 21 నుంచి సుమారు వందకు పైగా ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తంగా 618 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. వాటి విలువ సుమారు రూ.79 లక్షల వరకు ఉంటుందన్నారు. తక్కువ సమయంలో రికవరీ చేసి బాధితులకు అందజేయడానికి సాంకేతిక సహకారంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, సైబర్ సెల్ సిఐ టి.శ్రీను పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను నగరంలోని శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించనున్నట్టు స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారికా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో ఈత శిక్షణకు వచ్చిన క్రీడాకారులకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-5, 6 నుంచి 7, 8 నుంచి 9, 10 నుంచి 11, 12 నుంచి 14, 15 నుంచి 17 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలను ఆంధ్రప్రదేశ్ అమెచ్యుర్ ఆక్వాటిక్ అసోసియేషన్ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గొండు శంకర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మాట్లాడుతున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు తమ పరిధిలో సమగ్ర సమాచారాలతో సిద్ధంగా ఉండాలని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. శిక్షణా తరగతులను పరిశీలించిన అసిస్టెంట్ కమిషనర్ సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు వివరాలు, మూడు రోజులు ఇస్తున్న శిక్షణపై పలు ప్రశ్నలు వారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని మహిళలు, పురుషుల జనాభా గణాంకాలతో పాటు గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు, నిధుల వివరాలను ఏ క్షణాన అధికారులు అడిగినా సమాధానం చెప్పే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శిక్షణల ద్వారా మరింత అవగాహన పెంపొందించుకుని పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వాటిని అమలు చేస్తూ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణా మేనేజర్ ఎస్.లోకనాథం, ఎంపిడిఒ ఎం.రత్నం, సూపరింటెండెంట్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I under signed **KURAMANA KUSUMITA** (Old Name), W/o, KURAMANA UMA MAHESWARARAO D.No:- 1-582, SC street, Nandigam (village & Mandal,Srikakulam Dist Pin-532201, Change My Surname:- **KURAMANA KUSUMITA** (old Name) to **JAMANA KUSUMITA** (New Name) hence fourth. I am called as a **JAMANA KUSUMITA** (New name) for all purpose.

రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ఒబిసిలో చేర్పించేందుకు హామీ

ప్రజాశక్తి- టెక్కలి, సొంపేట

సొండి, కోమటి, శిష్టకరణ సామాజిక తరగతులను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్పించేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీనిచ్చారని శుక్రవారం ఆయనను ఢిల్లీలో కలిసినట్టు సొండి కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీ విశ్వనాధ చౌదరి ప్రకటనలో తెలిపారు. కేంద్రమంత్రి హోదాలో ఎంపీ హామీనివ్వడంపై సంఘ నాయకులు హర్షాన్ని వ్యక్తం చేసినట్టు తెలిపారు. రామ్మోహన్ నాయుడుని కలిసిన వారిలో సంఘ నాయకులు సాహుకారి నాగేశ్వరరావు, శిష్ట కరణ సంఘ నాయకులు ఉమామహేశ్వరరావు, కళింగ కోమటి సంఘ నాయకులు బోయిన గోవిందరాజులు ఉన్నారని తెలిపారు.

ఎస్ఐకు సూచనలు చేస్తున్న ఎస్పి మహేశ్వరరెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పొందూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. క్రెడిట్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఫోన్‌పేలు అప్డేట్ చేయాలని వివరాల కోసం ఒటిపి చెప్పాలని, లింక్ ఓపెన్ చేయాలంటూ అపరిచిత వ్యక్తులు చెప్పిన మాటలు నమ్మవద్దని తెలిపారు. అలాగే ఇటీవల యువత గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామన్నారు. మండలంలో క్వారీ నిర్వాహకులు సమయపాలన పాటించకుండా పేలుళ్లు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘించిన క్వారీ నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో శాంతి భద్రతల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు ఎస్ఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుందర శ్రీకాకుళం కోసం ప్రజలు క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రజలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గొండు శంకర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్‌పై హర్షవల్లి లయన్స్ క్లబ్ ముద్రించిన పోస్టర్లను విడుదల చేశారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ పేరిట వేసిన కరపత్రాలను పంచి పెట్టారు. డెంగీ, మలేరియా వ్యాప్తికి దోమలు కారణమని, చెత్త నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హారికా ప్రసాద్, కార్యదర్శి మణిశర్మ, చందక నీహార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మంత్రి తదితరులు

ఇది రాజ్యాంగంపై దాడి

పలాస: వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా సామాజిక న్యాయానికి చిహ్నంగా విజయవాడలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం చెప్పట్టిన అంబేద్కర్ విగ్రహం నామ ఫలకాలను పచ్చ మూకలు ధ్వంసం చేయడం ఇది రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నాని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతని, సమాజ స్థాపనకోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. సామాజిక న్యాయానికి చిహ్నంగా ఏర్పాటు చేసిన అలాంటి వ్యక్తి విగ్రహం వద్ద ధ్వంసానికి పాల్పడడం చాలా దారుణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ, మట్ట శ్రీను, బిఎస్ శ్రీను, కౌన్సిలర్ గుజ్జు జోగారావు, శంకర్ పండ, శిష్టు గోపి, అజయ్, కుమార్, కోటి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ఇసుక మేటలు సత్వరమే తొలగించాలి

నౌపడ : భావనపాడు హార్బర్ ముఖ ద్వారం వద్ద ఏర్పడిన ఇసుక మేటలను సత్వరమే తొలగించాలని కోరుతూ భావనపాడు మత్స్యకారులు శుక్రవారం ఎఫ్‌డిఒ ధర్మరాజు పాత్రోకు వినతిపత్రం అందజేశారు. మత్స్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గత నాలుగు నెలలుగా తాము పడుతున్న ఇబ్బందులను వినతిపత్రంలో వివరిస్తూ న్యాయం చేయాలని కోరారు. టిడిపి నాయకులు బి.తులసీదాసు, గొరకల ఆదినారాయణ, కారాడ పరమేశ్, యర్రయ్య, పోలయ్య పాల్గొన్నారు.

కొండములగాం హైస్కూల్‌కు ప్రథమ స్థానం

రణస్థలం: మార్చి -2024న జరిగిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో మొత్తం ఎపి మోడల్ స్కూల్స్ అన్నింటి కంటే జిల్లాలోని రణస్థలం మండలంలో ఉన్న కొండమూలగాం ఎపి మోడల్ హైస్కూల్ ఉన్నతమైన ఫలితాలు సాధించటంతో ఈ స్కూల్‌ని రాష్ట్రంలోనే ఎపి మోడల్ హైస్కూల్స్‌లో నెంబర్‌వన్ స్కూల్‌గా గవర్నమెంట్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ ఎన్నుకోవటం జరిగింది. ఆగస్ట్ 15న మంగళగిరిలో జరగబోయే 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు నాయుడు చేతులమీదగా బెస్ట్ స్కూల్ ఇన్ ఎపి మోడల్ హైస్కూల్స్ అవార్డును కొండములగాం మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ అందుకోనున్నారు. దీనిపై ఉపాధ్యాయ బృందానికి, ప్రిన్సిపాల్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర

లావేరు : మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- లావేరు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్రని జెడ్‌పి సిఇఒ డి. వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులు పాటు సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లే బాటలు వేయాలన్నారు. గ్రామాల్లో ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. కార్యదర్శులు బాధ్యత యుతంగా పని చేయాలన్నారు. ఎక్కడ తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు ఏర్పాటులో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్ రామన్, ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అక్కుల పేటలో గ్రామంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పర్యటించారు. సర్పంచ్ బొడ్డేపల్లి వసుమతి ఆధ్వర్యంలో చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. పంచాయతీ విధులు, అధికారాలు, బాధ్యతలు, వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోర్స్ కో-ఆర్డినేటర్, ఇఒపిఆర్‌డి గోవిందరావు, రిసోర్స్ పర్సన్స్ బి.నాగరాజు, బి.స్టాలిన్, వి.విక్రమ్, పి.రాము, టి. అభిలాష్ పాల్గొన్నారు.

బూర్జ: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే తద్వారా గ్రామాలు పురోగతిని సాధిస్తాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: పెద్ద పద్మాపురంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, కార్యాలయ ఎఒ తిరుపతి పట్నాయక్, కార్యదర్శి చింతల అప్పారావు, సర్పంచ్‌లు మాలతి

మెళియాపుట్టి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ భాస్కరరావు

శ్రీధర్, పెద్దింటి చందరరావు, ఎస్ రంగారావు, ఎస్.భాస్కరరావు, తెంబూరు ప్రసాదరావు పాల్గొన్నారు.

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఉషశ్రీ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, సూపరింటెండెంట్ సూర్య ప్రకాశరావు, సీనియర్ అసిస్టెంట్ దేవరాజు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవల రాంబాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నవ సమాజ స్థాపన బాలికా విద్యతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలం సింగుపురం కెజిబివి పాఠశాలలో శుక్రవారం ఒన్‌స్టాప్ సెంటర్లపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవసమాజ ఆడపిల్లలను చదివించడంతో పాటు వారి రక్షణకు సమాజం కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఆడపిల్లలు, మహిళలు కష్టం కలిగితే 108, 100, 118, 112 నెంబర్ల సమాచారం అందించాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికి తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. పిల్లలను స్వేచ్ఛగా ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వారి బాధ్యత పిల్లలకు భారంగా మారి వారి స్వేచ్ఛను హరించేలా ఉండకూడదన్నారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తంగా ఒన్‌స్టాప్ సెంటర్లు ఉపయోగ పడతాయన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పూర్తి అడ్డుకట్ట వేయాలన్నారు. బాలికలకు భరోసా కల్పించేందుకు ఒన్‌స్టాప్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై పూర్తి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, కెజిబివి అధ్యాపకులు, ఒన్‌స్టాప్ సిబ్బంది,

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను టెక్కలి ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని మౌలిక సౌకర్యాలు, విద్యాభివృద్ధి తదితర అంశాలు పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ టి.రాజేష్, ప్రిన్సిపాల్ రమ్య, స్వాతి పాల్గొన్నారు.

టెక్కలి : మాట్లాడుతున్న గిరిజన చైతన్యవేదిక నాయకులు

ఆదివాసీల మనుగడకు పోరాటమే మార్గం

ప్రజాశక్తి- పలాస

ఆదివాసీల మనుగడకు పోరాటమే సరైన మార్గమని, ఆదివాసీల హక్కుల కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని, ఆదివాసీ ప్రజలంతా ఏకమై ఉద్యమించి కార్పొరేట్ దోపిడి శక్తులను నిలువరించాలని జిల్లా ఆదివాసీ వేదిక నాయకులు పిలుపునిచ్చారు. మండలం గట్టుమీదవూరులో ప్రపంచ ఆదివాసీ దినం సందర్భంగా శుక్రవారం అఖిల భారత ఆదివాసీ వేదిక (ఎఐటిఎఫ్) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ రక్షణ చట్టాలను రద్దుచేసి, ఆదివాసీలను అడవి నుంచి తరిమేసి, అటవి సంపదను కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆదివాసీ వ్యతిరేక నూతన అటవీ సంరక్షణ సవరణ చట్టంను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హక్కులు, ఆదివాసీ రక్షణ చట్టలు లేకుండా ఆదివాసీలు జీవించడం ఎంత కష్టమో గమనించి పోరుబాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల కోసం చరిత్రలో తిరుగుబాట్లు, పోరాటాలు చేసి తమ విలువైన ప్రాణాలను అర్పించిన ఆదివాసీ వీరులు కొమరం భీమ్, రాంజీగోండ్, బిర్సాముండా, సోయం గంగులు, కొర్రా మల్లయ్య, కుంజా ముత్యాలు, అల్లూరి, కోరన్నా మంగన్న, ఆదివాసీలతో మమేకమై వారితోనే తమ జీవితాలను త్యాగం చేసిన జిల్లా పోరాట యోధులు కుమారన్న, జయక్క, సీతారాముల వంటి అమరులు అందించిన పోరాట వారసత్వం, పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఉద్యమ బాటను పట్టాలన్నారు. కార్యక్రమంలో కుమారన్న, జయక్కల స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల యూత్ లీగ్ జిల్లా కన్వీనర్ సార జగన్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు రాపాక మాధవరావు, జడే అప్పయ్య, సవర నారాయణరావు, సవర సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలం గొట్టిపల్లి పంచాయతీ కేంద్రంలో గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మక అప్పన్న మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళవుతున్న నేటికి ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి ఆమడ దూరంలోనే ఉన్నాయన్నారు. పాలకులు మారినా గిరిజన బతుకులు మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని, గిరిజన ప్రాంతాల్లో యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, గిరిజన హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గేదెల గంగమ్మ, ఆరిక శివ, పాలక శివ, గేదెల పురుషోత్తం, సంతోష్ కుమార్, గేదెల తులసమ్మ, రత్నాలమ్మ పాల్గొన్నారు.

టెక్కలి: జిల్లాలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ జరగాలంటే మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా టెక్కలిలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఆదివాసీ గిరిజన నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో సంఘ నాయకులు వరహాల కృష్ణారావు, సవర చౌక్కారావు, పెద్దింటి నేపాల్, సవర భాస్కరరావు, మల్లిపురం భాగ్యలక్ష్మి, బెజ్జి ప్రసాద్, హరిపురం ఆనందరావు పాల్గొన్నారు.

నరసన్నపేట సిఐగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్ఐలు నరసన్నపేట సర్కిల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎస్ఐలకు సూచించారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ

సోంపేట: మండలం మామిడిపల్లి కాశీ నీలకంఠేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అశోక్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, నాయకులు వెదుల్ల హరికృష్ణ, రత్నాల వాసు, టి వీరాస్వామి, ఎన్.సోమేశ్వరరావు, దుమ్ము నేతాజీ, దున్న వీరస్వామి, జి.రామారావు పాల్గొన్నారు.

జాతీయ కాష్యూ అసోసియేషన్‌లో 'మల్లా'

పలాస: జాతీయ కాష్యూ అసోసియేషన్‌లో ప్రముఖ జీడి వ్యాపారి మల్లా కాంతారావుకు అరుదైన గుర్తింపు లభించింది. బెంగుళూరులో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న క్యాష్యూ అసోసియేషన్ సమావేశంలో కాంతారావు వ్యాపారవృద్ధిని గుర్తిస్తు జాతీయ డెలిగేట్‌గా ఎంపిక చేశారు. మొత్తం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గం ఎంపిక కూడా జరుగుతుందని కాంతారావు తెలిపారు. ఇప్పటికే ఈయన అంతర్జాతీయ క్యాజూ వ్యాపారస్తులతో సత్సంబంధాలు ఉండడంతో పాటు అందులో సభ్యులుగా కూడా వ్యవహరిస్తున్నారు. పలాస పారిశ్రామికవాడలో ఆయన జీడి పరిశ్రమ నెలకొల్పి అనేక మందికి జీవనభృతి అందిస్తున్నారు. కాంతారావుకు జాతీయ స్థాయి డెలిగేట్‌గా ఎంపిక చేయడంపై పారిశ్రామికవాడ జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి శాసనపురి శ్రీనివాసరావు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆయనకు తగిన గౌరవం దక్కాలని ఆకాంక్షించారు.

అవార్డు అందుకుంటున్న కాంతారావు

విద్యాభివృద్ధికి వెంకట్ కృషి అభినందనీయం

రణస్థలం రూరల్ : విద్యాభివృద్ధికి వెంకట సత్యనారాయణ చేస్తున్న సేవలు అభినందనీయమని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు అన్నారు. రోటరీ క్లబ్ సైబరాబాద్, ఎటి అండ్ టి కమ్యునికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రోటరీ క్లబ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, ఎటి అండ్ టి అసోసియేషన్ డైరెక్టర్ వెంకట సత్యనారాయణ శుక్రవారం కోష్టలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ల మిత్రుల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిని జగన్నాథం కుమారులు హరికృష్ణ, వెంకట్‌లు ప్రభుత్వ పాఠశాలలకు, అనాధ శరణాలయాలకు, స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన కంప్యూటర్లను అందజేయడం, వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. అనంతరం వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలన్న లక్ష్యంతో మండలంలో 100

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

కంప్యూటర్లు వితరణ చేయనున్నామని తెలిపారు. వీటితో పాటు యువతకు కెరీర్ గైడెన్స్ ఉపాధి కల్పనకు తమవంతు సాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, ఎంపిటిసి ఆసిరినాయుడు, పైడి అప్పుడుదొర, రౌతు శ్రీనివాసరావు, బానోజీనాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు : పొలంబడిలో మాట్లాడుతున్న ఎడిఎ రాజగోపాల్

నారు కొసలను తుంచి నాటాలి

పోలాకి: వ్యవసాయ క్షేత్రంలో వరినారు కొసలను తుంచి నాటాలని ఎడిఎ రవీంద్ర భారతి సూచించారు. శుక్రవారం గొల్లలవలస రెవెన్యూలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరినారు కొసలను తుంచి నాటడం వలన పురుగులు నశించి కీటకాల నుంచి పంటకు రక్షణ కల్పించవచ్చునన్నారు. వరినారు కట్టలను బీజామృతంలో 6 నుంచి 8 గంటల వరకు ఉంచి నాటినట్లయితే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎఒ చిరంజీవి, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందిగాం: ప్రతిఒక్కరూ పొలంబడి కార్యక్రమాన్ని వినియోగించుకుని అధిక దిగుబడులు పొందాలని మండల ఎఒ పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలంలోని దేవలభద్రలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ డి.మానస వీణ, రైతులు నారాయణరావు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలో పొలంబడి కార్యక్రమంలో మండల ఎఒ కిరణ్ వాణి పాల్గొన్నారు. ఎఇఒ జ్యోత్స్న, ఉదయ్ కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్య నారాయణ, సరస్వతి, ధనుంజయ్, సంగీత పాల్గొన్నారు.

కొత్తూరు: మండలం గొట్టిపల్లిలో పొలంబడి కార్యక్రమం ఎడిఎ బొడ్డేపల్లి రాజగోపాల్, ఎఒ ఎస్.స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించారు. వి.వి.ఎ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పోలాకి : పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

సాగునీరు విడుదల

బూర్జ: పాలకొండ మండలం వెలగవాడ గ్రామ సమీపంలో విజయరాంపురం గ్రామం వద్ద ఒనిగడ్డ ఆనకట్ట ద్వార ఖరీఫ్ సాగుకు సంబంధించి అధికారులు, ప్రజా ప్రతినిధులు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఒనిగడ్డ ఆనకట్ట ద్వారా బూర్జ మండలంలోని హరిపురం, పల్లాపురం, తుడ్డలి, డొంకలపర్త, లక్కుపురం, పాలవలస, పెద్దపేట, రామన్నపేట, మదనాపురం, అప్పలపేట, కొల్లివలస గ్రామాల్లో సుమారు 22 వేల ఎకరాలకు సాగునీరు అందించనుంది. అయితే గత కొంతకాలంగా ఒనిగడ్డ ఆనకట్టకు సంబంధించి షట్టర్లు మరమ్మతుకు గురి కావడం, కాలువల్లో పూడికలు పేరుకుపోవడం తదితర సమస్యల వలన సాగునీరు అందకపోవడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. అయితే ఎట్టకేలకు అధికారులు స్పందించి కొత్త షట్టర్లను ఏర్పాటు చేశారు. తద్వారా మండల బిసిసెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావు సాగునీటిని లాంఛనంగా విడుదల చేశారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ జెఇ శంకరరావు, ఐ.జి.కుమార్, మాజీ వైస్ ఎంపిపి పీరుకట్ల ప్రభాకరరావు, మాజీ ఒనిగడ్డ చైర్మన్ కడగల కృష్ణ, టిడిపి నాయకులు జడ్డు కృష్ణ, వారాడ రాంబాబు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేస్తున్న దుర్గారావు

మృతి చెందిన మురళీపాత్రో

బస్సు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పాత జాతీయ రహదారి రైల్వే గేటు వద్ద శుక్రవారం ఉదయం ఆర్‌టిసి బస్సు కింద పడి కాశీబుగ్గ బ్రాహ్మణవీధికి చెందిన మురళీపాత్రో (62) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాకుళం డిపోకు చెందిన ఈ బస్సు పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు వస్తున్న క్రమంలో గేటు వేయడంతో డ్రైవర్ గోపి బస్సును నిలుపుదల చేసాడు. అనంతరం గేటు ఎత్తిన తరువాత బస్సు కదిలే సమయంలో మురళీపాత్రో వెనుక చక్రాల కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్ల పాటు బస్టాండు ఆవరణలో స్వీట్‌షాపు నిర్వహిస్తు కుటుంబాన్ని పోషించుకున్నారు. అనంతరం వ్యాపారం కలిసి రాకపోవడంతో స్వీట్లు తయారు చేస్తు షాపులకు విక్రయించే వ్యాపారం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడడంతో ఆయన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును బస్సు డ్రైవర్‌ను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ముత్యాల బొంతులో సెబీ ఎన్ ఫోర్స్ మెంట్ టెక్కలి బృందాలు పలాస డిటిఎఫ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై శుక్రవారం సంయుక్త దాడులు టెక్కలి సిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయగా 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు నాటుసారా తయారీ వలన కలిగే నష్టాలను తెలిపి సారా తయారీ మానుకోవాలని సూచనలు చేశారు. సెబీ సిఐ జి.రాజశేఖర్ నాయుడు, పలాస డిటిఎఫ్ సిఐ పి.రామచంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన చెట్టు

మెళియాపుట్టి: మండలంలో పలాస రోడ్‌లోని తూముకొండ వద్ద మర్రిచెట్టు శుక్రవారం నేలకొరిగింది. అదే సమయంలో వ్యాను ప్రయాణిస్తుండగా వ్యాన్‌పై చెట్టు పడింది. వ్యాను ముందు భాగం నుజ్జవ్వగా అదృష్టవశాత్తు వ్యాన్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. అదే సమయంలో పెద్దగా రాకపోకలు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఎయిడ్స్‌పై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా హెచ్ఐవి ఎయిడ్స్ అనే అంశంపై శుక్రవారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఈ పోటీల్లో 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ విజేతగా శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కృష్ణ చైతన్య, ద్వితీయ స్థానంలో సారవకోటకు చెందిన హన్సిక, తృతీయ స్థానంలో బ్రాహ్మణతర్లాకు చెందిన హేమంత్, చేపల వీధికి చెందిన వర్షిత కైవసం చేసుకున్నారు.

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రాంతంలో వివిధ విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సు డ్రైవర్లుకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో ఎస్ఐ సత్యనారాయణ, రవాణా శాఖాధికారి అనిల్ ఉమ్మడిగా డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రధానంగా స్కూలు బస్సులు, స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే వ్యాన్ డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తు ప్రతిజ్ఞ చేయించారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి వాహనం నడిపినా, అతివేగంగా డ్రైవింగ్ చేసిన, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ యాజ మాన్యానికి చెందిన ప్రతినిధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. స్కూల్ బస్సులు, వ్యాన్లను తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

92 మందికి సంతూర్ స్కాలర్‌షిప్

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ మహిళా కళాశాలలో చదవుతున్న 92 మంది విద్యార్థినులకు విప్రో కెరీర్, విప్రో ఫౌండేషన్, 'సంతూర్ ఉమెన్స్ స్కాలర్ షిప్‌లకు ఎంపిక చేశారు. 2023- 24 విద్యా సంవత్సరానికి వీరు ఎంపికయ్యారు. ఏడాదికి రూ.24 వేలు వంతున మూడేళ్ల పాటు ఈ స్కాలర్ షిప్ అందజేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, సంతూర్ స్కాలర్ షిప్ ప్రోగ్రాం మేనేజర్ శుభ్రత దాసు, రాష్ట్ర సంతూర్ స్కాలర్ షిప్ ఆఫీసర్ శారద భరద్వాజ్‌లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు అభినందనలు తెలిపారు.

విద్యుత్‌శాఖ ఇఇగా యోగేశ్వరరావు

పలాస: పలాస విద్యుత్‌శాఖ ఇఇగా పైడి యోగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇఇ జి.ప్రసాదరావు పదోన్నతిపై విశాఖపట్నం సిఎండి కార్యాలయానికి జనరల్ మేనేజర్‌గా బదిలీ కావడంతో శ్రీకాకుళం విద్యుత్‌శాఖ కార్యాలయంలో డిఇగా పనిచేసిన పైడి యోగేశ్వరరావు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. అనంతరం ఇఇ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిఇఇ ఎస్.కృష్ణమూర్తి, ఎఇలు వివేకానంద, నాగభూషణరావు, యోగి, రమణ, గార రాజారావు, బిసి అసోసియేషన్ నాయకులు సనపల వెంకటరావు, చల్లా వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన కూన రవికుమార్ మొదటిసారిగా పొందూరు పట్టణానికి విచ్చేసిన సందర్భంగా శుక్రవారం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టిడిపి కార్యాలయానికి వచ్చిన ఆయనకు మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో, బాణాసంచాను కాల్చుతూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం పంచాయతీరాజ్ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, బలగ శంకర భాస్కరరావు, విజయలక్ష్మి, డి.రవి, సీపాన భాస్కరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాముకు చైర్మన్ పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి- రణస్థలం

రజక సాధికారిక కమిటీ సభ్యులు కన్వీనర్ రాముకు రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి కల్పించాలని రజక సాధికారిక కమిటీ సభ్యులు సోపేటి రామారావు, గన్నారెడ్డి, సింహాచలం, జొన్నాడ భాస్కర్, శీల సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు విజయనగరం జిల్లాకు రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి చేపట్టలేదని, రాబోయే నామినేటెడ్ పదవుల్లో టిడిపి రజక విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ గురజాపు రాముకు కేటాయించాలని టిడిపి రజక సాధికారిక నాయకులు కోరారు.

108 వాహనం పరిశీలన

ప్రజాశక్తి- పలాస

మండల కేంద్రంలో108 సేవలను పలాస డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు, జిల్లా ఫ్లీట్ మేనేజర్ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందుల నిర్వహణ, రికార్డు, డ్యూటీ చార్ట్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన సేవలు అందించాలని, అత్యవసర సమయంలో మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది బి.తారకేశ్వరరావు, మోహనరావు, ఎన్.వెంకటరావు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని మెట్టక్కివలస పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు వైద్యులు సాయి కిరణ్, అనిత దేవి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గర్భిణీలకు అమృత ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఎస్.జి. రమణ మాట్లాడుతూ ప్రతి నెల 9న అమృత ఆహారాన్ని గర్భిణీలకు అంద జేస్తున్నామని తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల సేవలను పురపాలక సంఘం మాజీ చైర్పర్సన్ తమ్మినేని గీత కొనియాడారు. ఈ సేవను ఫుడ్ కార్పొరేషన్ ఉన్నతాధికారిని జ్యోత్స్న నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ సేవలు ఇన్‌ఛార్జి, మాజీ ఎంపిపి మునగవలస రవీంద్రబాబు, స్టడీ సర్కిల్ ఇన్‌ఛార్జి కె.మల్లేశ్వరరావు, యోగేశ్వర పట్నాయక్, ప్రహ్లాదరావు, టిడిపి నాయకుడు నాగళ్ల మురళీధర్ యాదవ్, సేవాదళ్ గొల్ల మల్లేశ్వరరావు, తారారాణి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రా'తో వినియోగదారుల్లో చైతన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) ద్వారా వినియోగదారుల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం సీఎస్ఆర్, ఎన్‌జిఒ సమ్మిట్ 2024 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు చట్టాలపై అవగాహన లేక పోవడంతో అనేక రకాలుగా మోసపోతుంటారని, వారికి న్యాయ పరమైన సాయాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రా జిల్లా అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా, జిల్లా ఉపాధ్యక్షులు గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలంటే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు అవసరమని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ సెంటర్లను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖామంత్రి లోకేష్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల 5 ఎకరాల్లో నూతన భవనాలను నిర్మించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి

పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రామ్మోహన్, ప్రిన్సిపాల్ ఇజ్జాడ మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, ఎంపిటిసి వాణి, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం

జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్నదే ప్రజల ఆకాంక్షని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో సామ్యవాద విధానం, సమగ్ర పరిపాలన, పేదరిక నిర్మూలన, కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేవరకు ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. పరమేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మతతత్వ శక్తుల పాలనలో తిరోగమన దిశగా పయనిస్తున్నామని, ప్రజలు మేలుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డి. గోవింద మల్లిబాబు, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావు, మంత్రి నరసింహమూర్తి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభిమాన సంఘాల సేవలు ఆదర్శప్రాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీనటుల అభిమాన సంఘాలు అభిమానం పేరిట చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, భవిష్యత్‌లో ఈ సేవలు మరింత విస్తృతం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సినీనటుడు సూపర్‌స్టార్ మహేష్‌బాబు పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని కిన్నెర థియేటర్‌లో జిఎన్‌వి జిల్లా మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పుట్టినరోజు వేడుకలు, రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందదాయకమన్నారు. జిల్లాలో రక్తం కొరత ఎక్కువగా ఉందని, అభిమాన సంఘాలు, యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన అభిమానులకు మెడల్స్ అందించి అభినందించారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

ముందుగా థియేటర్ ఆవరణలో కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, దుంగ భాస్కర్, బస్వా నాని, జిల్లా మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బస్వా రాజేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్, సెక్రటరీ సరపయ్య, జాయింట్ సెక్రటరీ మహేష్‌బాబు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని డిజిటల్ ఎల్ టు సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులతో పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులను అవలంబించేలా కృషి చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వరిసాగు చేస్తున్న రైతులతో పంటలో పురుగులు, తెగుళ్ల ఉధృతి రాకుండా, కలుపు నియంత్రణకు అవసరమైన పద్ధతులను రైతులకు క్షేత్రస్థాయిలో తెలియజేశారు. వరుస క్రమంలో నాట్లు వేసుకున్న పంటల్లో కలుపు రాకుండా వీడర్ సహాయంతో వీడింగ్ చేసినట్లయితే కలుపు సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి, సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మీ కృష్ణవేణి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, బి.దేవీప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11న ఆదివారం నగరంలో పాత బస్టాండ్ వద్ద శ్రీ ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో నగరంలో ఉన్న నడక సంఘాల సభ్యులంతా విధిగా పాల్గొని రక్తాన్ని దానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, శ్రీ ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ ప్రతినిధులు బరాటం సంతోష్, పి.నాగేశ్వరరావు, అంధవరపు సంతోష్, పట్నాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

రేపు జాబ్‌మేళా

రణస్థలం రూరల్: ఈ నెల 11న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మండలంలోని నడుకుదిటిపాలెంలో ఎఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, ఎమ్మెల్యే ఈశ్వరరావు ఆధ్వర్యంలో బహుళ జాతీయ ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ల్యాబ్ జాబ్‌మేళా నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్లలోపు వయసు, 2004లో ఇంటర్ బైపిసి, ఎంపిసి గ్రూపుల్లో 60 శాతం సాధించిన పురుష అభ్యర్థులు మాత్రమే జాబ్‌మేళాకు హజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత డిగ్రీతో పాటు స్టైఫండ్, అనంతరం ఉద్యోగం కల్పించ బడుతుందన్నారు. వివరాలకు 8096888868, 7013319577 సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎఇ కిరణ్

అందుబాటులోకి మరుగుదొడ్లు

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ద్వారా నిర్మించిన మరుగుదొడ్లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎఇ కిరణ్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఇటీవల పాఠశాలలో విరామం సమయంలో బయటకు వెళ్లిన విద్యార్థులు కొట్లాడు కోవడంతో ఓ విద్యార్థి చేయి విరిగింది. దీనిపై ఎమ్మెల్యే రవికుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి నివేదిక కోరారు. తక్షణమే మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలంటూ వారికి ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎఇతో పాటు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఈశ్వరాచారి ఉన్నారు.

ఎస్‌పిని కలిసిన సిఐలు

శ్రీకాకుళం: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన కె.పైడిపునాయుడు, జె.శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆయా సర్కిల్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ముందుండా లన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై సిఐలకు దిశా నిర్దేశం చేశారు.

'కొరికాన' అకాడమీ ఉచిత తరగతులు

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో యువతీ, యువకులకు కొరికాన కాంపిటేటివ్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను ఆసక్తిగల యువతీ యువకులకు డిఎస్‌సి ఉచిత కోచింగ్ కొరకు రాష్ట్రస్థాయి అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని జనసేన పాతపట్నం నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవాని, ప్రముఖ పారిశ్రామికవేత్త, జనసేన నాయకులు కొరికాన రవిప్రసాద్ అన్నారు. ఈ డిఎస్‌సి నోటిఫికేషన్ కోచింగ్ మాత్రమే కాకుండా ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ప్రతి ఉద్యోగాల నోటిఫికేషన్‌కు రానున్న కాలంలో ఉచిత శిక్షణ ఇస్తామని కొరికాన రవికుమార్ అన్నారు.జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో జనసేన పాతపట్నం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పార్థసారథి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా డి.పార్థసారథి నియమితులయ్యారు. ఈమేరకు పురపాలక శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. న్యాయవాదిగా సేవలందిస్తున్న ఆయన టిడిపిలో క్రియా శీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించడంతో శుక్రవారం కమిషనర్ చల్లా ఓబులేసును మర్యాద పూర్వకంగా కలిశారు.

శనివారం 10-8-2024 శ్రీకాకుళం జిల్లా 8 పేజీలు

ఉద్దానం అభివృద్ధికి కృషి

- మూడోసారి గెలుపు మరింత బాధ్యతను పెంచింది
- నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి ఎకరాకూ సాగునీరు
- ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి – కంచిలి, సోంపేట

ఉద్దానం ప్రాంత అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరందించడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. వైద్యునిగా సేవలందిస్తూ తండ్రి బెందాళం ప్రకాష్ రాజకీయ వారసునిగా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అశోక్ పుట్టినరోజును పురస్కరించుకుని 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే.

గెలుపు బాధ్యతలను పెంచింది

మూడుసార్లు గెలవడం ఆనందంగా ఉంది. ఆ గెలుపు నాపై మరింత బాధ్యతను పెంచింది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల వెంటే ఉన్నాను. వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు పరిష్కారానికి కృషి చేశాను. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తుండడం వల్లే నాపై అంత ఆదరాభిమానాలు పెంచుకున్నారు. దాని ఫలితమే వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపు. నాపై వారు పెట్టుకున్న ఆశలు వమ్ము కాకుండా పనిచేస్తాను.

ఉద్దాన ప్రాంత అభివృద్ధికి కృషి

ఉద్దాన ప్రాంత ప్రజలు వారి బిడ్డగా నన్ను ఆదరిస్తున్నారు. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఉద్దానంలో కొబ్బరి పంట అభివృద్ధికి చర్యలు తీసుకుంటాను. కొబ్బరి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాను. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించడమైంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న ఉద్దానం కొబ్బరి రైతులకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో నష్టపరిహారం అందించాం. ఉచితంగా కొబ్బరి మొక్కలు పంపిణీ, ఇతర తోడ్పాటు చర్యలు చేపట్టాం. గత ప్రభుత్వంలో బారువ నారుమడి క్షేత్రం నిర్లక్ష్యానికి

మిగతా 2లో

బెందాళం అశోక్ బయోడేటా

పేరు : డాక్టర్ బెందాళం అశోక్

తల్లిదండ్రులు : బెందాళం జ్యోతిబాల, ప్రకాష్ (మాజీ ఎంపిపి)

జననం : ఆగస్టు 10, 1982

స్వస్థలం : రామయ్యపుట్టుగ, కవిటి మండలం

విద్యార్హత : బిడిఎస్, డిప్లమో ఇన్ ఇన్ప్లాంటాలజీ

వృత్తి : బిడిఎస్ దంత వైద్యులు

భార్య : నీలోత్పల

కుమార్తె : కీర్తి

రాజకీయ ప్రవేశం : వైద్య వృత్తిని వదిలి తండ్రి వారసునిగా 2013లో రాజకీయరంగ ప్రవేశం. 2014లో తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 26,278 ఓట్ల మెజారిటీతో విజయం. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా 7,483 ఓట్ల మెజార్టీతో గెలుపు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా మూడోసారి హ్యాట్రిక్ గెలుపు.

ఉద్దానం అభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తైంది. దాన్ని అభివృద్ధి చేస్తాం. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాను.

ప్రతి ఎకరాకూ సాగునీరు

నియోజకవర్గ పరిధిలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఎక్కువగా నిధులు కేటాయించాం. కంచిలి మండలం గంగాసాగరం రిజర్వాయర్ అభివృద్ధికి రూ.11 కోట్లు మంజూరు చేయగా, గత ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోయాయి. సోంపేట మండలంలో ప్రధానమైన పైడిగాం చానల్ అభివృద్ధికి రూ.పది లక్షలు ఖర్చు చేయడమైంది. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆ చానల్ మరమ్మతులకు గుర్తైంది. వైసిపి హయాంలో సాగునీటి రంగాన్ని విస్మరించారు. ఫలితంగా రైతులకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. ఇరిగేషన్ ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టి పంట భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపడతాను. ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ధ్యేయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానంపై కచ్చితమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. వంశధార, బాహుదా నదుల అనుసంధాన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఇది పూర్తయితే రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుంది.

కిడ్నీ ఆస్పత్రికి సదుపాయాల కల్పన

పలాసలో ఏర్పాటు చేసిన కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గత టిడిపి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంకురార్పణ చేశారు. అప్పట్లో రూ.50 కోట్లు మంజూరు చేశారు. వైసిపి ప్రభుత్వం భవనాలు నిర్మించి తామే తెచ్చామని గొప్పలు చెప్పుకున్నారు. అవసరం మేరకు పరికరాలు లేకుండా, సిబ్బంది నియమకాలు చేపట్టకుండా అప్పటి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని విమర్శించారు. ప్రస్తుతం అక్కడ ఎటువంటి వసతులు లేవు. అక్కడ డయాలసిస్‌తోపాటు పూర్తిస్థాయిలో నెఫ్రాలజిస్టులను నియమిస్తాం. కిడ్నీ ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాల కల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు.

ఎన్నికల హామీల అమలు చేస్తాం

రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేవు. గత ప్రభుత్వ నిర్ణయాలు, అవలంభించిన విధానాల ఫలితంగా దివాళా తీసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూనే మరోవైపు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ఉండేలా పాలన సాగిస్తున్నారు. ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛను పెంచాం. అన్నా క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి. మెగా డిఎస్‌సితో ఉద్యోగాల భర్తీ చేయనున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత సిలిండర్ల అమలుపై అధ్యయనం సాగుతోంది. త్వరలో ఇవి కూడా అమలు కానున్నాయి.

పరుగులు పెడుతున్న పాలన

- వరుస సమీక్షలతో ఎమ్మెల్యే అశోక్
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా...
- అవినీతిరహిత పాలనపై దిశానిర్ధేశం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

ముచ్చటగా మూడోసారి ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన శాసనసభ్యులు బెందాలం అశోక్ పాలన పరుగులు పెట్టిస్తున్నారు. నియోజకవర్గ అధికారులతో వరుస సమీక్షలతో భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అంతే కాకుండా కేంద్రమంత్రితో ఇచ్ఛాపుర ంలో రివ్యూ మీటింగ్ పెట్టి గత ప్రభుత్వంలో లోపాలు కడిగి పారేశారు. వాస్తవాలు ఒకసారి పరిశీలిస్తే నియోజకవర్గ వ్యవసాయ అధికారుల సమీక్షలో గతంలో జరిగిన అక్రమాలపై నిలదీశారు. ముఖ్యంగా కంచిలి పిఎసిఎస్ ద్వారా వచ్చిన ఎరువులు వ్యవసాయ శాఖ అధికారులకు తెలియకుండానే రైతులకు అందజేశారా? ఎరువులు తెచ్చి ఏళు గడుస్తున్నా ఇప్పటికీ ఇంకా ఉన్నట్టే చూపిస్తూ, కనీసం డిబిటి కూడా చేయకుండా వ్యవహరిస్తుంటే మీరేం చేస్తున్నారు? పిఎసిఎస్ ద్వారా రైతుల కోసం తెప్పించిన ఎరువులు పక్కనే ఉన్న ఒడిశాలో డంప్ చేసి మళ్లీ ఆ రైతులకే అధిక ధరలకు విక్రయిస్తుంటుంటే వ్యవస్థను ఏమని అర్థం చేసుకోవాలి? సదరు వ్యక్తులు, సంస్థలకు నోటీసులు ఇచ్చి నెలలు గడిచినా తదుపరి చర్యలు తీసుకోకుండా ఎందుకు నీళ్లు నములు తున్నారు అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచిలి పిఎసిఎస్ ద్వారా 2022లో తెప్పించిన ఎరువుల అక్రమాలపై ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఫిర్యాదులు వచ్చినా ఎందుకు పట్టించుకోలేదని, మండలంలో వ్యవసాయాధి .కారికి సమాచారం లేకుండానే వ్యవహారం చేశారంటే మండలంలో ఏం జరుగుతోందని ఎమ్మెల్యే విస్మయం వ్యక్తం చేశారు. తక్షణమే దీనిపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించి, విచారణ చేపట్టాలని ఎడిఎని ఆదేశించారు. అదే విధంగా పిఆర్ డిపార్ట్మెంట్ రివ్యూలో కూడా ఇదే పరిస్థితి. గత ఐదేళ్లుగా వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారని, ప్రజల కనీస అవసరాలు కూడా నిర్లక్ష్యం చేసి నిధులు పక్కదారి పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో చేపట్టిన పనుల వివరాలు, నిధుల చెల్లింపు వివరాలు తెలుసుకుని విస్మయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పల్లెలను పట్టణాలకు అనుసంధానం చేస్తూ, గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సిసి రోడ్లకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించలేదని తెలుసుకుని నివ్వెరపోయారు. అదే సమయంలో ప్రభుత్వం గత ఐదేళు గా ఊదరగొట్టిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బికెలు, బిఎంసియుల నిర్మాణం, నిధుల కేటాయింపు వివరాలు తెలుసుకుని ముక్కున వేలేసుకున్నారు. నియోజకవర్గంలో 86 సచివాలయాలు మంజూరైతే 41 మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకోవడం, ఆర్‌బికెలు 86 కు 36, వెల్‌నెస్ సెంటర్లు 68కి 17, బిఎంసియు కేంద్రాలు 56 కి కేవలం మూడు మాత్రమే పూర్తయినట్టు తెలుసుకుని ఎమ్మెల్యే అవాక్క య్యారు. ఇక డిజిటల్ లైబ్రరీలు నియోజక వర్గంలో ఒకటి కూడా ప్రారంభించ లేదని అధికారులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్ల ఎంతో గొప్పగా చెప్పుకున్న నిర్మాణాలు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కనీసం పది శాతం కూడా పూర్తి చేయలేదని, అదే సమయంలో ఎంపీ నిధులతో ప్రారంభించిన పనులు 95 శాతం పూర్తి చేయడం గమనార్హమని అన్నారు. నిధుల మళ్లింపు కారణంగానే ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయని, అరకొరగా పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక గొల్లుమంటున్నారని తెలిపారు. అదే విధంగా రూర్బన్ నిధులపై సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నిధులు దుర్వినియోగం జరిగినట్టు గుర్తించారు. తక్షణమే వాటిపై పూర్తి సమాచారంతో నివేదిక అందజేయాలని సోంపేట జెఇని ఆదేశించారు. ఇదే కోవలో ఆర్అండ్‌బి, వసతి గృహాల నిర్వహణ తదితర శాఖలపై సమీక్షలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకం లబ్ధిదారులకు చేరాలని, అందులో ఎటువంటి అక్రమాలు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. దీంతో నియోజకవర్గ అధికారులు విధి నిర్వహణలో ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

ఈదుపురం వంతెన ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అశోక్ (ఫైల్)

ఇచ్ఛాపురం అభివృద్ధిలో అశోక్ ముద్ర

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే బెందాలం అశోక్ పాత్ర సుస్పష్టంగా కనిపిస్తుంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో తొలిసారిగా 2014 ఎన్నికల్లో విజయం సాధించినప్పుడు వయసులో చిన్నవాడు ఎటువంటి అనుభవం లేని వ్యక్తి ఎమ్మెల్యేగా బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తారని సర్వత్రా ఉత్కంఠతో ఎదురు చూశారు. వరుసగా రెండోసారి, తాజాగా మూడోసారి భారీ మెజారిటీతో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అయితే అందరి అంచనాలు తలకిందులు చేస్తూ. మొదటిసారి నియోజకవర్గం ప్రగతి పథంలో నడిపేందుకు అనుభవం అక్కర్లేదు లక్ష్యం ఉండాలి. అది అశోక్ దగ్గర ఉండడం వలన నియోజకవర్గం అభివృద్ధి బాటలో పరుగులు పెట్టించారు. ఎవ్వరు సాధించలేనిది సాధ్యం చేస్తూ ప్రత్యర్థులను హడలెత్తించిన సంఘటనలు ఉన్నాయి. మచ్చుకు ఇచ్ఛాపురం మండలలో ఈదుపురం గ్రామం వద్ద ఉన్న బాహుదా నదిపై వంతెన నిర్మాణం కోసం దశాబ్దాలు గడిచినా నేతలు మారి ప్రభుత్వాలు మారినా జరగలేదు. ఎమ్మెల్యేగా అశోక్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎందుకు ఈ వంతెన నిర్మాణం జరగదో చూస్తానని ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎవరూ ఊహించని విధంగా బాహుదా నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేసి ఈదుపురం, కవిటి, సోంపేట రోడ్డు అభివృద్ధి చేశారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి కావడం వలన ఇచ్ఛాపురం నుంచి కవిటి, కవిటి నుంచి ఇచ్ఛాపురం రావడానికి దాదాపు 10 కిలోమీటర్లు దూరం తగ్గడం వలన అనేక వర్గాలకు ఉపయోగకరంగా మారింది. అదే విధంగా మండలంలో శివారు ప్రాంతమైన బొడ్డపడ గ్రామానికి సరైన రహదారి ఉండేది కాదు. ఈ గ్రామానికి వెళ్లాలంటే బాహుదా నది దాటాల్సిందే. ఎన్నికల సమయంలో, వరదలు వచ్చినప్పుడు ఈ గ్రామం జలదిగ్బంధంలో ఉండేది. కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ వంతెన నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసినా సగంలో నిలిచిపోయింది. అశోక్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడులా నిలిచిపోయిన వంతెన ఫైల్ దగ్గరుండి అన్ని అనుమతులు తీసుకోని నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో బోడ్డపడ వంతెన నిర్మాణం కూడా అశోక్ హయంలో పూర్తి చెయ్యడం జరిగింది. దీంతో ఈ గ్రామస్తులు అశోక్ చూపిన చొరవ ఇప్పటికీ మర్చిపోలేదు. ఇక సరైనా వసతి లేక ఆరుబయట చదువులు చదువుతూ మరుగుదొడ్లు లేక అనేక అష్ట కష్టాలు పడిన మహిళా జూనియర్ కళాశాలలో మహిళలు పడుతున్న పాట్లుకు ఎమ్మెల్యే అశోక్ చలించారు. దీంతో సరైన్ వసతి సౌకర్యాలు కల్పించేందుకు నూతన భవనం నిర్మించేందుకు స్థలం వేటలో పడ్డారు. అప్పుడు స్థానికంగా ఉన్న కొంత మంది మీడియా మిత్రులు సలహా సూచనలతో బంగ్లా రోడ్‌లో నిరుపయోగంగా ఉన్న రహదారులు భవనల శాఖ భవనం కనిపించింది. సుమారు ఐదెకరాల విస్తీర్ణం కలిగిన స్థలం నిరుపయోగంగా ఉండడంతో అందులో ఒక ఎకరా మహిళా కళాశాల కోసం కేటాయించే ప్రయత్నంలో అనేక ఆరోపణలు ఎదుర్కొంటురు. ఎన్ని ఆరోపణలు వచ్చిన స్థలం కేటాయించి నూతన భవన నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పుడు అన్ని రకాల సౌకర్యాలతో విద్యార్థినులు చదువుకోవడం ఎమ్మెల్యే అశోక్ చూపించిన చొరవకు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రసంశిస్తున్నారు. ఇదే బాటలో మిగిలిన మండలాల్లో గణనీయమైన అభివృద్ధి చేయడం వలనే ఇక్కడ ప్రజలు వరసగా మూడోసారి కూడా భారీ మెజారిటీతో అఖండ విజయం ఇప్పించారు. తాజాగా మూడోసారి విజయం సాధించిన ఎమ్మెల్యే అశోక్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నారు. దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యరూపం దాల్చరు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా బెందాలం అశోక్ మార్క్ కనిపిస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బాహుదా నదిపై మూడో వంతెనకు అశోక్ శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలో రావడంతో మూడో వంతెన అరకబద్ర నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. అదృష్టవశాత్తు మూడోసారి ఎమ్మెల్యేగా అశోక్ గెలవడంతో అరకబద్ర వంతెన నిర్మాణం పూర్తి స్థాయిలో జరుగుతుందని గట్టి నమ్మకం పెట్టుకున్నారు. రెండవసారి 2019లో మళ్లీ ఎమ్మెల్యేగా అశోక్ గెలిచినప్పటికీ వైసిపి అధికారంలోకి వచ్చింది. ఆయన టిడిపి అధికారంలో లేకపోయినా పార్టీ క్యాడర్‌కి నిత్యం అందుబాటులో ఉంటూ ఏదైనా కష్టం వచ్చిన నేనున్నానని భరోసా కల్పించారు. టిడిపి క్యాడర్ కూడా చెక్కు చెదరకుండా అశోక్ వెంటే ఉంటూ మళ్లీ గద్దెనెక్కించారు. ఈ సారి బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు అశోక్ రంగం సిద్ధం చేసుకున్నారు.

వంతెనపై రాకపోకలు

మహిళా జూనియర్ కళాశాల ప్రారంభ శిలాఫలకం

విప్ పదవి ఖాయమేనా?

- మరికొద్ది రోజుల్లో పదవీయోగం!
- నియోజకవర్గానికి దక్కనున్న గౌరవం
- అశోక్ అభిమానుల ఆశలు ఫలించేనా?
- సామాజిక కూర్పుపై అధిష్టానం దృష్టి
- అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నాలు

ప్రజాశక్తి- కవిటి

ముచ్చటగా మూడోసారి ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన శాసనసభ్యులు బెందాలం అశోక్‌కు ఈసారి మంత్రి పదవి తప్పదని ఇచ్ఛాపురం నియోజకవర్గం క్యాడర్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న కాళింగ సామాజిక వర్గం ఆశగా చూసింది. అయితే మంత్రివర్గంలో ఎమ్మెల్యే అశోక్‌కు చోటు దక్కలేదు. చివరకు జిల్లాలో మెజారిటీ సామాజిక వర్గమైన కాళింగులకు మొండి చేయిచూపారు. దీంతో కాళింగ సామాజికవర్గం పూర్తిస్థాయిలో అసంతృప్తిలో ఉందనేది బహిరంగ సత్యం. దీంతో కాళింగ సామాజిక వర్గానికి సంతృప్తి పర్చేందుకు త్వరలోనే డాక్టర్ బెందాళం అశోక్‌కు పదోన్నతి కలగనుందని అత్యంత విశ్వశనీయ వర్గాల సమాచారం. మూడు విజయాలతో హ్యాట్రిక్ కొట్టిన అశోక్‌కు ఒక దశలో మంత్రి పదవే వరించనున్నట్టు జోరుగా ప్రచారం జరిగింది. ఆ కల ప్రస్తుతానికి సాకారం కాకపోయినా, నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు రాబోవు రోజుల్లో ఆయనకు ప్రమోషన్ లభిస్తుందని తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే క్యాడర్, ఆయన ముఖ్య అనుచరులు కూడా చెబుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అడ్డాగా ఉంది. గత పది సార్వత్రిక ఎన్నికల్లో, తొమ్మిది సార్లు టిడిపి అభ్యర్థిని ప్రజలు గెలిపించడమే దీనికి నిదర్శనం. పార్టీకి అంత స్ట్రైక్ రేట్ విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రతినిధులకు ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ ఎటువంటి ప్రత్యేక గుర్తింపును ఇవ్వలేదు. ఈసారి మాత్రం నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు జోష్ పెంచే విధంగా అశోక్‌కు తగిన ప్రాధాన్యతను తెలుగుదేశం పార్టీ కల్పించనుంది. ఇప్పటికే ఆలస్యమైనా, భవిష్యత్‌లో సరైన నిర్ణయం తీసుకుని 2029 నాటికి నియోజకవర్గాన్ని, జిల్లాను మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ పావులు కదుపుతోంది. జిల్లాలో సామాజిక సమీకరణాలు, వాటిని సమన్వయం చేసే విధంగా నామినేటెడ్ పదవుల పంపకం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సంసిద్ధం చేయడం వంటి కీలక అంశాలపై పార్టీ అధిష్టానం దృష్టి సారిస్తోంది. అధికార పార్టీ అవలంభించబోయే రాజకీయపరమైన విధానాలపై ఒకసారి దృష్టి సారిస్తే..

సామాజిక సమన్యాయం దిశగా వ్యూహాలు

జిల్లాలో కాళింగ, కాపు, యాదవ, మత్స్యకార సామాజిక వర్గాలకు జిల్లా, రాష్ట్రస్థాయిల్లో తగు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో పార్టీ పెద్దలు అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిసింది. రాష్ట్ర క్యాబినెట్ కూర్పులో కాళింగ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగినట్టు పార్టీ గుర్తించింది. కూటమిగా నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు క్యాబినెట్ కూర్పులో ' కోత ' ఏర్పడింది. దీంతో జిల్లాకు ఒక్క మంత్రి పదవితో సరిపెట్టాల్సి వచ్చింది. అందువలన కాళింగ సామాజిక వర్గానికి ప్రాధాన్యతను తెలుగుదేశం పార్టీ ఇవ్వలేక పోయింది. దీంతో జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రాధాన్యత కలిగిన సామాజిక వర్గాలకు సమన్యాయం చేసేందుకు పార్టీ ప్రణాళికను సిద్ధం చేసింది. వెలమ సామాజిక వర్గం నుంచి కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులను ఒకే కుటుంబానికి ఇవ్వడం, మిగిలిన సామాజిక వర్గ నాయకులు, పెద్దలు అధికార పార్టీపై అసంతృప్తిని వెళ్లగక్కడం వంటి పరిస్థితులను పార్టీ పరిశీలించింది. వాటి నివారణ చర్యల్లో భాగంగా క్యాబినెట్‌లో స్థానం కల్పించ లేకపోయినా, ఆ హోదా కలిగిన చీఫ్‌విప్ పదవిని ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్‌కు లేదా బెందాళం అశోక్‌కు దక్కుతుందని సామాజిక వర్గ పెద్దలు, ఆయా నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో చీఫ్ విప్ పదవిని దూళిపాళ్ల నరేంద్రకు, విప్ పదవిని బెందాళం అశోక్‌కు ఇస్తున్నారనే సంకేతాలు పార్టీ పెద్దల నుంచి అందుతున్నాయి. గతంలో విప్ పదవిని తాను చేపట్టానని, చీఫ్ విప్ పదవి అయినా టిటిడి బోర్డు చైర్మన్ పదవి అయినా తనకు కేటాయించాలని కూన రవికుమార్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. విప్ పదవిని మరోసారి చేపట్టేందుకు రవికుమార్ విముఖత చూపించిన నేపథ్యంలో ఆ స్థానం అశోక్ బాబుతో భర్తీ చేయనున్నారు. ఇక జిల్లాలో మరో కీలక సామాజిక వర్గమైన కాపులకు కీలకమైన నామినేట్ పదవిని ఇవ్వనున్నారు. డిసిసిబి చైర్మన్ పీఠం అనాదిగా ఆ సామాజిక వర్గానికే వస్తోంది. ఈసారి కూడా వారికే ఇవ్వనున్నట్టు సమాచారం. శ్రీకాకుళం మేయర్ పీఠానికి ఎన్నికలు జరిగి 17 సంవత్సరాలు పూర్తయింది. ఐదు విలీన పంచాయతీల సమస్య హైకోర్టులో ఉన్న నేపథ్యంలో ఈ ఎన్నిక నిర్వహణ జరగట్లేదు. ఐదు పంచాయతీల పెద్దలతో చర్చలు జరిపి, ఆ కేసును వెనక్కి తీసుకునే విధంగా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుంటే, శ్రీకాకుళం నగర కార్పొరేషన్ ఎన్నిక సుగుమం అవుతుంది. సహజంగా అధికార పార్టీకి విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మేయర్ పీఠాన్ని కళింగ వైశ్యులకు లేదా యాదవులకు కేటాయించే అవకాశం ఉంటుంది.

బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురానికి ఇవ్వనున్న ప్రాధాన్యం

రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ వేవ్ ఏ రకంగా ఉన్నా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మాత్రం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపు ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేసేందుకు గత ప్రభుత్వం ఎన్నో పదవులను నియోజకవర్గానికి కేటాయించింది. మహిళ అభ్యర్థిని నిలబెట్టి మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించింది. ఎమ్మెల్సీ, డిసిఎంఎస్, వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి ఊహించనంత ప్రాధాన్యతను గత ప్రభుత్వం నియోజకవర్గానికి కల్పించింది. ఎన్నో పదవులు.. మరెన్నో ప్రలోభాలకు గురిచేసినా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మెజారిటీని సైతం తగ్గించలేకపోయారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడ్డాక ఇచ్ఛాపురం నియోజక వర్గానికి 10 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగితే అందులో తొమ్మిది సార్లు పార్టీ ఇక్కడ విజయకేతనాన్ని ఎగరవేసింది. అయినప్పటికీ ఇక్కడ కార్యకర్తలు నాయకులు కాలర్ ఎగరేసే విధంగా ఒకసారి కూడా ఎమ్మెల్యేకు గౌరవ స్థానం తెలుగుదేశం పార్టీ కల్పించలేదు. ఈసారి అధినాయకుని ఆలోచనలో మార్పు రావడం... యువశక్తిని ప్రమోట్ చేయాలనే సంకల్పంతో పార్టీ పెద్దలు ఉండడం, సామాజిక వర్గానికి క్యాబినెట్‌లో స్థానం కల్పించకపోవడం వంటి ప్రతికూల, అనుకూల అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటున్నారు. జరిగిన నిర్లక్ష్యానికి బదులుగా ఈసారి ఇచ్ఛాపురం తెలుగుదేశం పార్టీకి తగిన ప్రాధాన్యత కల్పించనున్నట్టు భోగట్టా..!! మిత్రపక్షాలు భవిష్యత్‌లో పక్కలో బల్లెం మాదిరి ఏర్పడనున్న నేపథ్యంలో తమ పార్టీ కార్యకర్తలను నాయకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని పార్టీ భావిస్తోంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, వాటి పరిధి పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకుని కూటమి ప్రభంజనాన్ని సృష్టించింది. ఇవే ఫలితాలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పునరావృతం చేయాలన్నా, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ విజయం గాలివాటం కాదని నిరూపించాలన్నా ముఖద్వారం ఇచ్ఛాపురం నుంచే వ్యూహం అమలుకు శ్రీకారం చుట్టాలి.

ఏ బాధ్యతనైనా నిర్వహిస్తా...

విప్ పదవికి తన పేరు పరిశీలనలో ఉన్నట్టు జరుగుతున్న ప్రచారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన ఈ విధంగా స్పందించారు. ప్రభుత్వం తన పనితీరును గుర్తెరిగి ఏ బాధ్యతను అప్పగించినా సమర్థవంతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో నాయకులు తమకు ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పదవులు కావాలని ఎలా ఎదురు చూస్తున్నారో... అదేవిధంగా అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న తాను కూడా పదోన్నతి కావాలని కోరుకోవడం తప్పేమీ కాదు కదా...!! జిల్లాలో సమీకరణాలన్నింటినీ, సమీక్షిస్తున్నారు. ఛీఫ్‌విప్, విప్ తదితర పదవులపైన చర్చలు సాగుతున్నాయి. జిల్లాలో అన్ని వర్గాల వారికి కింజరాపు కుటుంబం న్యాయం చేస్తుంది. కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీల వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమలాంటి వారికి ప్రమోషన్ కాస్త ఆలస్యం అయ్యింది. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా, పెద్దలు ఏ బాధ్యతను అప్పజెప్పితే ఆ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తాను.

పదోన్నతి కోసం శ్రేణుల ఎదురుచూపులు

గత ప్రభుత్వం పదవుల పందేరంలో ఇచ్ఛాపురం నియోజక వర్గానికి పెద్దపీట వేసింది. తమ పార్టీకి రికార్డు స్థాయిలో విజయాలను అందిస్తున్నా తమకు తగిన గౌరవం దక్కడం లేదనే అసంతృప్తి పార్టీ శ్రేణులకు ఉంది. ఈ నిరాశ, నిస్పృహల మధ్య, అశోక్ బాబుకు విప్ పదవి వరించనుందనే సమాచారం పార్టీ శ్రేణులకు ఆశలు కలిగించింది. గతంలో విప్‌గా పనిచేసిన కాళింగ సామాజిక వర్గానికి చెందిన కూన రవికుమార్ ఈసారి ఆ పదవిని చేపట్టనని అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లడంతో ఈసారి కచ్చితంగా పదోన్నతి కలుగుతుందనే ఆశాభావంతో పార్టీ క్యాడర్ ఎదురుచూస్తోంది. బలమైన సామాజికవర్గం, హ్యాట్రిక్ విజయాలు, ఉన్నత చదువు, కింజరాపు కుటుంబంపై విధేయత, వివాద రహితుడనే గుర్తింపు, లోకేష్ కోటరీలో ప్రాధాన్యత, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో పోరాట తీరు, నిరంతరం ప్రజలతో మమేకమైన వ్యవహార శైలి వంటి రాజకీయ సుగుణాలను కలిగిన అశోక్‌కు క్యాబినెట్‌లో దాదాపు స్థానం దక్కిందని.. అనూహ్యంగా చివరి నిమిషంలో పేరు మారిందని ఆయన అనుయాయులు తరచు ప్రస్తావిస్తుంటారు. అశోక్ వ్యవహార శైలిని దగ్గరగా పరిశీలించిన పార్టీ పెద్దలు, రాబోవు రోజుల్లో ప్రమోషన్ కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. మొన్నటి అసెంబ్లీ సమావేశాల ముగింపు రోజు విప్‌గా అశోక్ పేరు ప్రకటిస్తారని జిల్లాలో జోరుగా ప్రచారం జరిగింది. ఇదే విషయాన్ని గ్రహించిన నియోజకవర్గ శ్రేణులు అభినందనలు తెలిపేందుకు వేరే వేరే సాకులు చూపుతూ అమరావతికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కారణాలు ఏమైనా మరోసారి ప్రకటన వాయిదా పడటంతో ఎమ్మెల్యే శ్రేణులు ఎదురుచూపుకే పరిమితమయ్యాయి. రాబోవు కొద్ది రోజుల్లోనే ఎమ్మెల్యే అశోక్ విప్‌గా పదోన్నతి పొందనున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

2029 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కూటమిలోని మూడు పార్టీలు వ్యూహరచనలు చేసు కుంటున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే తమ తమ బలాన్ని చూపించే ందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తమ పార్టీలకు వీర విధేయులుగా పనిచేసిన ముఖ్యులకు నామినేటెడ్ పదవుల ద్వారా గుర్తింపును ఇచ్చి ఆయా సామాజికవర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాబోయే ఎన్నికలు మూడు పార్టీలకు అత్యంత కీలకం. ప్రస్తుత ముఖ్యమంత్రికి వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికి వయోభారం ఏర్పడుతుంది. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా వచ్చే ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సంసిద్ధం చేయనుంది. అదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ముఖ్యమంత్రి రేసులో ఉంటారు. భారతీయ జనతా పార్టీ కూడా తమ బలాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తుంది. కేంద్రం నుంచి ఇన్ని నిధులను, రాష్ట్ర పునర్నిర్మాణానికి ఇచ్చామని ప్రజల్లోకి వెళుతుంది. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున, ఈలోపే తమ పార్టీలను, శ్రేణులను బలోపేతం చేసు కునేందుకు పన్నాగాలు పార్టీలు పన్ను తున్నాయి. మరో రెండేళ్లలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కు ఇప్పటినుంచి వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. స్థానిక సంస్థలు ఎన్నికలకు కూటమిగా పని చేస్తాయా, విడివిడిగా పోటీ చేస్తాయా అనే అంశం చాలా కీలకమైనది. వచ్చే సంవత్సరానికి నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియ కూడా పూర్తి కావచ్చనే మాటలు వినిపిస్తున్నాయి. పెరిగిన నియోజక వర్గాలకు సమన్వయకర్తలను ఏర్పాటు చేసుకోవడం నుంచి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా సంసిద్ధత చేయాల్సిన బాధ్యత పార్టీ పెద్దలు గుర్తిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ పాలనను జన రంజకంగా చేపడుతూ మరోవైపు నుంచి పార్టీని కూడా బలోపేతం చేసుకునే పనిలో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి.

అందరి మంచి కోరే వ్యక్తి అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రస్తుత రాజకీయ నాయకుల్లో అందరికంటే భిన్నంగా అందరి మంచి కోరే బెందాలం అశోక్ బంగారం లాంటి మనిషని టిడిపి 22 వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్ అన్నారు. తన దగ్గరకి వచ్చిన ప్రతి వ్యక్తికి పార్టీలకు అతీతంగా పని చేయడం అశోక్ నైజం. చిన్నాపెద్దా అన్న తారతమ్యం లేకుండా పార్టీ క్యాడర్‌కు గౌరవిస్తారు. వరుసగా మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే అశోక్‌కు

మంత్రి పదవి దక్కకపోవడం పార్టీ క్యాడర్‌లో బాధ ఉంది. కేవలం ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయంలో అందరూ కావాల్సిన వారే. చాల సులువుగా అందరితో కలిసిపోయే మనస్తత్వం అశోక్‌ది. అందుకే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వరసగా మూడుసార్లు బ్రహ్మరథం పట్టారు.

కార్యకర్తలకు అండగా అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆనందంలో కష్టంలో కూడా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ నేనున్నాని భరోసా కల్పించే నాయకుడు ఎమ్మెల్యే బెందాలం అశోక్ అని టిడిపి మూడోవార్డు కౌన్సిలర్ పత్రి తవిటియ్య అన్నారు. సామాన్య కార్యకర్తకు కూడా గౌరవించే నాయకుడు ఉండడం చాలా అరుదు. తామంతా ఎమ్మెల్యే అడుగుజాడలలో ముందుకు వెళ్తాం. టిడిపి కార్యకర్తకు కష్టమని ఆయన గుమ్మం తడితే

తక్షణం స్పందించే మనస్తత్వం అశోక్‌ది. అందుకే పార్టీలకు అతీతంగా అందరిచే ప్రశంసలు అందుకుంటారు. ప్రతి కార్యకర్తను పేరుతో పిలిచే చనువు సాన్నిహిత్యం ఆయనది. మంత్రిగా గుర్తింపు లభించి ఉంటే క్యాడర్‌లో ఇంకా సంతోషం. అధిష్టానం తప్పకుండా ఈ నియోజకవర్గం ప్రజల, కార్యకర్తల మనోగతం నిజం చేసే రోజు కోసం ఎదురు చూస్తున్నాం.

అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం

చిన్న, పెద్దా అనే తేడాలేకుండా అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం ఎమ్మెల్యే అశోక్ సొంతం. అందుకే అందరూ అతనిని తనవాళ్లుగా అభిమానిస్తారు. అతని నాయకత్వంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వచ్చే ఐదేళ్లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

- సూరాడ చంద్రమోహన్,
జెడ్‌పిటిసి మాజీ సభ్యులు,
ఎర్రముక్కాం, సోంపేట

ప్రజా సేవకులు

వయసులో చిన్నవాడైనా పార్టీ కార్యక్రమాలపై, ప్రజలకు సేవ చేయాలని దృక్పథంలో ఎమ్మెల్యే అశోక్ ఎంతో పెద్దవాడు. అతడితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ప్రజల కోసం సేవ చేయడానికి నిరంతరం కృషి చేస్తుంటారు. మన్ముందు ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను.

- భిన్నల జగన్నాథం,
టిడిపి నాయకులు, సోంపేట

యువతకు స్ఫూర్తి

అశోక్ తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ దూకుడుతో అభివృద్ధి వైపు నియోజకవర్గాన్ని నడిపిస్తున్న తీరు అభినందనీయం. ప్రస్తుత యువతరానికి ఎమ్మెల్యే అశోక్ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో ప్రజలు మూడోసారి పట్టం కట్టారు.

- సాహుకారి దివాకరరావు, టిడిపి
నాయకులు, మామిడిపల్లి,
సోంపేట మండలం

గంగాసాగరం రిజర్వాయరు పూర్తయ్యేనా!

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని రైతులకు ప్రధాన సాగునీటి వనరైన గంగసాగరం రిజర్వాయరు పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూ ఉండడంతో మండలానికి చెందిన రైతులు తీవ్ర ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో టిడిపి హయాంలో గంగాసాగరం అభివృద్ధికి రూ.11 కోట్లు నిధులు మంజూరు జరిగి సుమారుగా రూ.6 కోట్లు పనులు పూర్తయ్యాయి తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా నిలిచిపోవడంతో రైతుల ఇబ్బందులు మొదటి వచ్చాయి మరలా టిడిపి భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం రావడంతో ఈసారైనా గంగాసాగరం

ముళ్లపొదలతో నిండిన ప్రధాన కుడి కాలువ

రిజర్వాయరు పనులు పూర్తవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

సుమారుగా 1200 ఎకరాల ఆయకట్టు కలిగి, మండలంలోనే అతిపెద్ద సాగునీటి జలవనరుగా పేరుగాంచిన గంగాసాగర్ రిజర్వాయరు నిర్మాణ పనులు ఏళ్ల గడుస్తున్నా కొనసాగుతూనే ఉన్నాయి. 2007లో మొదటిసారిగి రిజర్వాయరు ఏర్పాటు ప్రతిపాదనలు వచ్చి, భూ సేకరణ చేశారు. రూ.3 కోట్లతో పనులు ప్రారంభించినా పూర్తి కాలేదు. అనంతరం 2013 ఫిబ్రవరి 15న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ రూ.6.3 కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయరు పనులకు శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి సాగరం చుట్టూ రాతితో గట్టు ఏర్పాటు చేశారు. అయితే తరువాత పనులకు నిధులు విడుదల కాకపోవడంతో మరలా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రిజర్వాయరు పనులు పూర్తిచేయాలంటే మరో రూ.4 కోట్లు నిధులు అవసరముతాయని అధికారులు చెబుతున్నారు. సాగరం ఆయకట్టు రైతులంతా వర్షాలపైనే ఆధారపడుతున్నారు. రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేసి, సాగరం నుంచి ప్రధానంగా వెళ్తున్న కుడి, ఎడమ కాలువలను సైతం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడితేనే లక్ష్యం నెరవేరుతుందని రైతులు చెబుతున్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే అశోక్

రైతులకు ఎంత ఉపయోగపడే గంగాసాగరం రిజర్వాయరు పనులు పూర్తి చేయడంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది. గతంలో టిడిపి ప్రభుత్వ హాయంలో నిధులు మంజూరు జరిగినా, అని వార్య కారణాల వల్ల పనులు అద్దాంతరంగా నిలిచిపోయాయి. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గంగాసాగరంతోపాటు మండలంలోని మిగిలిన సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి సైతం ప్రణాళికలు సిద్ధం చేశాం.

రూ.1.42 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం

సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించి రూ.1.42 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. 17 పనులకు సంబంధించి ఈ ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- ఎంఎస్ పాణిగ్రాహి, ఇరిగేషన్ ఎఇ



ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృశ్యమాలిక

ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృశ్యమాలిక



ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ జన్మదిన ప్రత్యేక సంచిక